చేనేతకు త్వరలోనే అధునాతన మగ్గాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- సిద్దిపేట జిల్లా ఏడీ ఎం. సాగర్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

7



సిలిండర్ పేలడంతో వ్యాపిస్తున్న మంటలు

ఆకునూరులో
పేలిన గ్యాస్ సిలిండర్

- ఆరుగురికి తీవ్రగాయాలు
- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

చేర్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరులో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. గ్రామానికి చెందిన శెట్టి భాస్కర్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో భార్య, ముగ్గురు పిల్లలు, అతని తండ్రి నిద్రిస్తుండగా.. భాస్కర్ నిద్రలేచి గ్యాస్ వెలిగించాడు. అప్పటికే గ్యాస్ లీకవడంతో సిలిండర్ పేలింది. ఇంట్లో తీవ్రంగా మంటలు వ్యాపించి పొగ కమ్ముకుంది. మంటల తాకిడికి భాస్కర్, భార్య కావ్య, అతడి తండ్రి అయ్యాల, కూతుళ్లు ప్రణవి, కృతిక, హర్షిణి తీవ్రంగా గాయపడ్డారు. వారి కేకలు విన్న చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. వారిని స్థానికులు ఆటోలో చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే అంబులెన్స్ రావడంతో అందులో ఎక్కించారు. చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ నవీన్‌తో పాటు రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితులను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందె అశోక్ తదితరులు బాధితులను పరామర్శించారు. సిలిండర్ పేలిన ఘటనలో ఇంటిపైకప్పు కూలడంతో పాటు వస్తుసామగ్రి కాలి బూడిదైంది. సుమారు రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.



గాయపడిన భాస్కర్, అతని కుటుంబీకులు

లంచాల లారీ..!

ఉమ్మడి జిల్లాలో దారితప్పుతున్న ఖాకీలు

- వారంలోనే ఏసీబీ చేతికి చిక్కిన ఇద్దరు ఎస్ఐలు
- పోలీస్‌శాఖలో పెచ్చుమీరుతున్న అవినీతి
- ఖాకీల వేధింపులతో బలవన్మరణ ప్రయత్నాలు
- శాంతిభద్రతల కన్నా సంపాదనే మిన్న..

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం అస్సద్ మహ్మద్‌పల్లి తండా వద్ద వరి కోత యంత్రం పరికరాల దొంగతనం జరిగింది. యజమాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దొంగిలించిన పరికరాలు గ్రామంలోనే హార్వెస్టర్ యజమానికి లభించాయి. కేసు రాజీ కుదిర్చేందుకు ఎస్ఐ రాజేశ్ రూ.40వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితులు ఏసీబీని ఆశ్రయించడంతో మంగళవారం పట్టుబడ్డాడు.

సంగారెడ్డి రూరల్ ఎస్ఐగా ఉన్న రవీందర్‌ను అక్టోబరు 3వ తేదీన సస్పెండ్ చేశారు. సంగారెడ్డిలోని లాడ్జిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా.. లాడ్జి నిర్వాహకుడిని ప్రత్యక్ష సాక్షిగా పేర్కొంటూ అతని వద్ద డబ్బులు డిమాండ్ చేసి వేధించాడు. దీంతో లాడ్జి నిర్వాహకుడు మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ వేధింపుల వల్లే ఇదంతా జరిగిందని ప్రాథమిక విచారణలో తేలడంతో సస్పెండ్ చేశారు.

సిద్దిపేట జిల్లా ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ రాజు రూ.50వేలు లంచం తీసుకుంటూ ఈ నెల 11న ఏసీబీకి పట్టుబడ్డారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఓ ఇంటి సమస్యను పరిష్కరించడానికి లంచం డిమాండ్ చేశారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు.



సంగారెడ్డి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో పోలీస్‌శాఖపై అవినీతి ఆరోపణలు పెరుగుతున్నాయి. కొందరు అధికారులు లంచం లేనిదే పనిచేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు నిదర్శనంగా గడిచిన వారం రోజుల్లోనే ఇద్దరు ఎస్ఐలు, కానిస్టేబుల్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గత నెలలో ఓ ఎస్ఐని సస్పెండ్ చేశారు. తమ ఉద్యోగాన్ని దుర్వినియోగం చేస్తూ అందినకాడికి దండుకున్నారు. ఎవరైనా తమ మాట వినకుంటే లాఠీ ఎత్తి తమ దారిలోకి తెచ్చుకుంటున్నారు.

సెటిల్మెంట్లలో కీలకం

సివిల్ పంచాయతీల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని ఉన్నతాధికారులు, కోర్టులు హెచ్చరిస్తున్నా కొందరి తీరు మారడం లేదు. డబ్బులు ఖర్చు పెట్టి పోస్టింగులు తెచ్చుకున్న వారు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. కానిస్టేబుళ్ల నుంచి సీఐల దాకా ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. రెండు నెలల క్రితం సిద్దిపేట రూరల్ సీఐ తనను చితకబాదడంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డట్లు ఓ యువకుడు లేఖ రాశాడు. ప్రస్తుతం ఇదే స్టేషన్‌లో ఓ గ్రామానికి చెందిన భూమి సెటిల్మెంట్ జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, అమీన్‌పూర్, భానూరు, రామచంద్రాపురం, కొల్లూరు ప్రాంతాల్లో భూవివాదాలు, పారిశ్రామిక వివాదాల్లో తలదూర్చుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక సిద్దిపేట జిల్లా గజ్వేల్ డివిజన్ పరిధిలోనూ వసూళ్ల పర్వం నడుస్తున్నట్లు చర్చ జరుగుతోంది. చేర్యాల ప్రాంతంలో పోలీసుల పేరిట ఓ నాయకుడు రూ. లక్ష తీసుకున్నారనే పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి.



పారిపోతుండగా ఎస్ఐను పట్టుకొచ్చిన ఏసీబీ అధికారులు

ఎంతోకొంత ఇవ్వాల్సిందే..

పలు పోలీస్‌స్టేషన్లలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఉదారంగా వ్యవహరిస్తుండగా ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మాత్రం చేతులు చాపుతున్న పరిస్థితి దాపురించింది. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన బాధితులను కూడా వదలడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక కేసులను రాజీ కుదర్చడం, నిందితులను పట్టుకురావడం, ఇతర వ్యవహారాల్లోనూ ఆశిస్తున్నట్లుగా విమర్శలు ఉన్నాయి. ఆర్థిక స్థోమత లేనివారికి సరైన న్యాయం జరగడం లేదని, డబ్బులు లేదంటే పైరవీల ద్వారా వచ్చిన వారికే పెద్దపీట వేస్తున్నారనే చర్చ కొన్ని ఏరియాల్లో నిత్యం జరుగుతోంది. తాజాగా టేక్మాల్ ఎస్ఐ

మిగతా 7వ పేజీలో



వదులని.. చలి

- ఉమ్మడి మెదక్ జిల్లాలో వారం రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు

కోహీర్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో చలితీవ్రత కొనసాగుతూనే ఉంది. మంగళవారం ఉదయం సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంలో 7.8 కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లాలోని నార్లాపూర్‌లో 9.5, సిద్దిపేట జిల్లాలోని పోతారెడ్డిపేటలో 9.2డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 17 ప్రాంతాలలో మంగళవారం సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదుకావడం గమనార్హం.

సంగారెడ్డి జిల్లాలో..

కోహీర్ 7.8, న్యాల్‌కల్ 8.2, ఝరాసంఘం 8.4, సదాశివపేట 8.4, అల్గోల్ 9.1, మొగుడంపల్లి 9.3, కడ్పల్ 9.4, రాయికోడు 9.5, దిగ్వాల్ 9.5, కంగ్టి 9.8, నిజాంపేట్ 9.9, నల్లవల్లి 10.1, సత్వార్ 10.1, పుల్కల్ 10.2, నాగల్‌గిద్ద 10.2, మనూర్ 10.7, మల్‌చేల్మ 10.8,మునిపల్లి 10.8, ముక్తాపూర్ 10.9, సిర్గాపూర్ 10.9, రామచంద్రపురం 11.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో..

నార్లాపూర్ 9.5, దామరంచ 9.9, దొంగల ధర్మారం 10.1, శంకరంపేట 10.3, మినీపూర్ 10.3, బోడగట్ 10.3, చిట్కుల్ 10.4, శివనూర్ 10.4, మనోహరాబాద్ 10.5, లింగాయపల్లి 10.6 కుల్చారం 10.6, టేక్మాల్ 10.6, బుజ్జారంపేట్ 10.7, వెల్దుర్తి 10.7, శివంపేట 10.8, మాసాయిపేట్ 112.2 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లాలో

పోతరెడ్డిపేట్ 9.2, కొండపాక 9.7, హబ్షిపూర్ 9.8, అంగడికిష్టాపూర్ 9.9, దూల్మిట్ట10.3, దౌల్తాబాద్ 10.4, వెంకటరావుపేట్ 10.4, తుక్కాపూర్ 10.4, నంగునూరు 10.6, కొండకండ్ల 10.7, రేబర్తి 10.7, మునిగడప్ప 10.7, మిరుదొడ్డి 10.8, రాంపూర్ 11.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

టెట్ టెన్షన్

- జిల్లాలో 558 ఉపాధ్యాయ పోస్టులు
- నోటిఫికేషన్‌తో మొదలైన సన్నద్ధత
- టీచర్లలో మొదలైన భయం!

సిద్దిపేట కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి 29 వరకు టెట్ దరఖాస్తులను స్వీకరిస్తుండగా, వచ్చే జనవరి 3 నుండి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థులు సాధన మొదలుపెట్టారు. కొంతమంది కోచింగ్ సెంటర్లకు వెళ్తుండగా, మరికొంతమంది లైబ్రరీల్లో, గదుల్లో ఉంటూ సొంతంగా సిద్ధమవుతున్నారు.

జిల్లాలో పోస్టులు ఖాళీ

ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీతో పాటుగా ఇతర కేటగిరీల్లో మొత్తం 558 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్ 177 పోస్టులు, ఎస్‌జీటీ 340 పోస్టులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల 9 పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. అయితే, వీటిలో 70:30శాతం పద్ధతిలో పదోన్నతుల ద్వారా ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ టెట్ పరీక్ష కీలకంగా మారింది. ఇదిలా ఉంటే 2010 కంటే ముందు ఉపాధ్యాయ పోస్టుల్లో ఉన్నవారు కూడా తప్పనిసరిగా టెట్ రాయాల్సిన అవసరం ఉంది. ఎవరైతే 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకుని పదోన్నతి పొందాలనుకుంటారో వారికి టెట్ అర్హత తప్పనిసరి.

మరోసారి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సందడి మొదలైంది. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో జిల్లావ్యాప్తంగా అభ్యర్థులు ప్రిపరేషన్‌ను వేగవంతం చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 558 టీచర్ పోస్టులపై అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తుండగా, మరోవైపు 2010కి పూర్వం నియామకమైన ఇన్-సర్వీస్ టీచర్లకు సుప్రీంకోర్టు తీర్పు కారణంగా టెట్ క్వాలిఫై కావడం తప్పనిసరి కావడం ఆందోళన కలిగిస్తోంది. టెట్ నుంచి తమను మినహాయించాలని ఉపాధ్యాయ సంఘాలు కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాయి.



జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

మినహాయింపు కోసం..

సెప్టెంబర్ 1న వెలువడిన సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, ఐదు సంవత్సరాల పైబడిన సర్వీస్ ఉన్న టీచర్లు పదోన్నతి అవసరమనుకుంటే రాబోయే రెండేళ్లలో టెట్ తప్పనిసరిగా క్వాలిఫై కావాలని సుప్రీం తీర్పు వెలువరించింది. దీంతో టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 1378 మంది ఉపాధ్యాయులకు టెట్ అర్హత ఉంది. అలాగే మరో 1382 మంది ఉపాధ్యాయులు టెట్ క్వాలిఫై కావాల్సి ఉంది.

మిగతా 8లో...

విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రాధాన్యం

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

గజ్వేల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రజాపాలనలో విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమల, గనులశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గజ్వేల్‌లోని సమీకృత మార్కెట్‌లో రూ. 3కోట్ల వ్యయంతో నిర్మించనున్న దుకాణ సముదాయాల నిర్మాణానికి, రూ.1.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పత్తి మార్కెట్ ప్రహరీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గజ్వేల్ మార్కెట్‌కు ఆదాయం సమకూర్చడం కోసం దుకాణ నిర్మాణాలకు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంజూరు ఇచ్చారని తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు వేగంగా నిర్మించేందుకు కృషి చేస్తున్న కలెక్టర్ హైమావతి, యంత్రాంగాన్ని అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ.. గజ్వేల్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని మంత్రిని కోరారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

గజ్వేల్‌లోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. ఎంసీహెచ్‌ను జిల్లా కలెక్టర్ హైమావతితో కలిసి ఆయన సందర్శించి మాట్లాడారు. వారివెంట కలెక్టర్ హైమావతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఆర్డీవో చంద్రకళ, డీఎంవో నాగరాజు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ, మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్

ఎర్రజెండాలు ఏకమైతే దేశంలో అధికారం

- సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీలు ఏకమైతే దేశంలో బలమైన శక్తిగా ఎదిగి ప్రభుత్వాలు ఏర్పాటవుతాయని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాటం చేసిన చరిత్ర కేవలం కమ్యూనిస్టు పార్టీకే ఉందన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, 'దున్నేవాడికి భూమి కావాలనే' నినాదంతో పోరాటం చేసింది సీపీఐనేనని అన్నారు. కేంద్రంలో మతోన్మాద మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేని శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద పవన్, జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి మణికంఠరెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభను ఎవరూ అడ్డుకోలేరు : సీపీ

- యువజన ఉత్సవాల్లో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



మర్కుక్ విద్యార్థిని కీర్తన తయారు చేసిన ట్రెడ్మిల్‌ను పరిశీలిస్తున్న సీపీ

సిద్దిపేట కల్చరల్/మర్కుక్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత తమ అభిరుచులకు తగ్గట్టుగా ఎంచుకున్న రంగంలో నైపుణ్యాన్ని సాధించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్.ఎం విజయ్ కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో జిల్లా యువజన సర్వీసులు క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రతిభ ఉంటే ఎవరు కూడా అడ్డుకోలేరన్నారు. నేటి యువత కళలు, సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలన్నారు. సోషల్ మీడియాను కూడా సరైన రీతిలో వాడుకోవచ్చని సూచించారు. మర్కుక్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంట విద్యార్థిని కీర్తన తన గైడ్ చిన్నబ్రహ్మయ్య సహకారంతో తయారు చేసిన ట్రెడ్మిల్ తనను బాగా ఆకర్షించిందని సీపీ అన్నారు. తక్కువ ఖర్చుతో ఇంధన రహిత ట్రె డ్మిల్ చాలా బాగుందన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, డీవైఎస్‌వో వెంకట నర్సయ్య మాట్లాడారు. జిల్లాస్థాయి పోటీల్లో దాదాపు 100 పైగా ఎంట్రీలు రాగా ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం దక్కనుంది. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. జానపద నృత్యం స్టోరీ రైటింగ్, పెయింటింగ్, పోయెట్రీ వంటి సాంస్కృతిక పోటీలతో పాటుగా సైన్స్‌మేళాను ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారుచేసిన ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను సీపీ తిలకించి విద్యార్థులను అభినందించారు.

నేడు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ 53వ రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 19, 20, 21 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే ప్రదర్శనకు సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వేదిక కానుంది. ఈ ప్రదర్శనలో జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన కోసం 187 ఎగ్జిబిట్లు, ఇన్‌స్పైర్ కోసం 180 ఎగ్జిబిట్లు ప్రదర్శించనున్నారు. ఇందుకోసం 13 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతి కమిటీలో మండల విద్యాధికారి కన్వీనర్‌గా, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కోకన్వీనర్‌గా ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. మూడు రోజులపాటు సాగే ఈ ప్రదర్శనలు వీక్షించడానికి వెయ్యి మందికి పైగా సందర్శకులు వస్తారని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్ కోరారు.



నాచగిరి క్షేత్రంలో జరిగిన గిరి ప్రదక్షిణలో భక్తులు

ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడవాలి

వర్గల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్నటువంటి ఎటువంటి కార్యక్రమమైనా అంతా విజయమే జరుగుతుందని, ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడిచినట్లయితే అందరికీ శుభం కలుగుతుందని మెదక్ రంగంపేట పీఠాధిపతులు మాధవానంద సరస్వతీ స్వామిజీ అన్నారు. మంగళవారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకొని స్వామిజీ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించిన గిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి హాజరై స్వామిజీతో పాటు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం ఆలయం వద్ద స్వాతి నక్షత్ర హోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మాధవానంద సరస్వతీ స్వామి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

మల్లన్న కల్యాణానికి ఏర్పాట్లు చేయండి

- ఆలయ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, సీపీ
- అదనపు నిధుల కోసం నివేదిక సమర్పించాలని ఆదేశం

కొమురవెల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం, బ్రహ్మోత్సవాలపై మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టర్ హైమావతి, సీపీ విజయ్ కుమార్ ఆలయ పరిసరాలను పరిశీలించారు. క్యూకాంప్లెక్స్, సత్రం నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీపీ విజయ్‌కుమార్ ఆలయ పరిసరాలను పరిశీలించి స్థానిక పోలీస్ అధికారులకు రాజగోపురం పక్కన కమాండ్ కంట్రోల్ రూంను, పోలీస్ బొమ్మ చౌరస్తాలో పోలీస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కింగ్ కోసం అనువైన స్థలాలను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. వారి వెంట ఆలయ కార్యనిర్వహణాధికారి టంకశాల వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, పలువురు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హైమావతి

ఒకరోజు వేతనం కట్ చేయండి

గజ్వేల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విధులకు సమయానికి హాజరుకాని వైద్యులు, సిబ్బందికి ఒక రోజు వేతనం కట్ చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వోను కలెక్టర్ హైమావతి ఆదేశించారు. అహ్మదీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9:34 అవుతున్నా హెచ్‌ఈవో, ఆయా మినహా మిగతా వైద్య సిబ్బంది, వైద్యులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి గైర్హాజరైన వారి వివరాలను నమోదు చేసి ఒక రోజు శాలరీ కట్ చేయాలని డీఎంహెచ్‌వోను ఫోన్ ద్వారా కలెక్టర్ ఆదేశించారు.

ఈ నెల 21న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ ఎంపికలు

మెదక్ అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు ఈనెల 21న ఖేలో ఇండియా అస్మిత జిల్లాస్థాయి ఎంపికలు మెదక్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. అండర్-14, 16 బాలికలకు రన్స్, త్రో, జంప్స్ మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. మిగితా వివరాలకు ఫోన్ 9963005540 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి


సాయిలు మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

రాయపోల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేపల వేట కోసం వెళ్లిన వ్యక్తి చెరువులో మునిగి మృతిచెందిన సంఘటన రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గజ్వేల్‌కు చెందిన మోతె సాయిలు(45) ఈ నెల 16న సాయంత్రం చేపల వేటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి ఓ బాలుడితో కలిసి బైక్‌పై లింగారెడ్డిపల్లి చెరువుకు వెళ్లాడు. అక్కడ చేపలు పడుతున్న సమయంలో సాయిలు చెరువులో మునిగిపోయాడు. ఎంతసేపైనా ఆయన పైకి రాకపోవడంతో భయపడిన బాలుడు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. సోమవారం సమాచారం అందుకున్న బంధువులు చెరువు వద్దకు చేరుకొని గాలింపు చేపట్టారు. సోమవారం సాయంత్రం సాయిలు మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీశారు. మృతుని భార్య మోతె పెంటవ్వ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మానస తెలిపారు.

బాలుడిని చితకబాదిన పిన తండ్రికి రిమాండ్


సత్యనారాయణ

రామాయంపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలుడిని చితకబాదిన పిన తండ్రిని మంగళవారం పోలీసులు రిమాండ్ చేశారు. రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటకు చెందిన సత్యనారాయణ ఈ నెల 13న భార్యతో గొడవపడి ఆమె కొడుకుని బెల్టుతో కొట్టి రాక్షసంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత చిన్నారికి మెదక్ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడిని మంగళవారం అందుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై బాలరాజ్ తెలిపారు.

కంది సాగు.. లాభాలు బాగు

- పత్తి, మొక్కజొన్నతోపాటు అంతర పంటగా కంది..
- జిల్లా వ్యాప్తంగా 7 వేల ఎకరాలకు పైగా సాగు
- పూత, కాయ దశలో జాగ్రత్తలు కీలకం

జగదేవ్‌పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అలిరాజపేట పరిసరాల్లో పత్తి చేనుల్లో మధ్యంతర పంటగా కంది మంచి ఎదుగుదలతో కనిపిస్తోంది. తక్కువ ఖర్చుతో లాభాలు చేకూర్చే పంటగా రైతులు కందిని ఎక్కువగా ఎంచుకుంటున్నారు. తేలికపాటి ఎర్ర నేలల్లో అధికంగా సాగుచేసే ఈ పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటమే కాక, కూలీల అవసరం కూడా స్వల్పమే. జిల్లాలో 7వేల ఎకరాలకు పైగా సాగుచేయగా, గజ్వేల్ డివిజన్ పరిధిలోని జగదేవ్‌పూర్, మర్కుక్, వర్గల్, కుకునూరుపల్లి మండలాల్లో కంది సాగు ఎక్కువగా నమోదైంది. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉండటంతో చేనులో పురుగుల బారిన పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. మంచు అధికంగా ఉండటంతో ఆకు చుట్టూ పురుగు ప్రబలే ప్రమాదం ఉన్నందున రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు ఇలా..

ఆకు చుట్టూ పురుగు నివారణకు లీటరు నీటికి 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మరుక మచ్చల పురుగు నియంత్రణకు హెమామెక్ క్లినెంజోమెట్, ప్రొక్లెమ్ లేదా బెంజర్న్ 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాయ తొలిచే పురుగు నివారణకు చేతితో కనపడిన పురుగులను తొలగించాలి. అలాగే స్పైనోసాడ్ 45 ఎస్‌సీ 2.5 మిల్లీలీటర్లు లేదా ఎమామెక్టిన్ బెంజోయెట్ 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. కాయ తుప్పు (కాయ ఈగ) వల్ల పంటలోని కాయల్లో లార్వా ఉండి, బీజాలు పొడిగా మారుతాయి. దీని నివారణకు క్వినాల్‌ఫాస్ 25 ఈసీ 2 ఎంఎల్ లీటరు నీటిలో పిచికారీ చేయాలి.



అలిరాజపేటలో ఏపుగా పెరిగిన కందిచేను

అంగన్‌వాడీ రికార్డులు తగులబెట్టిన దుండగులు



బూడిదమైన రికార్డులు

చిలప్‌చెడ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్టోర్ రూంలో భద్రపరిచిన అంగన్‌వాడీ రికార్డులను గుర్తు తెలియని దుండగులు తగులబెట్టిన సంఘటన మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామంలో గత రాత్రి చోటుచేసుకుంది. మంగళవారం అంగన్‌వాడీ టీచర్ షహనాజ్ బేగం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి సంబంధించిన 1987 నుంచి 1996 వరకు గల రికార్డులను పాఠశాలలో గల ఒక గదిలో భద్రపరచగా, ఎవరో గుర్తు తెలియని దుండగులు తగులబెట్టినట్లు ఆమె తెలిపారు. ఆ వేడికి గది పైకప్పు పెచ్చులు కూడా ఊడిపడినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు వచ్చి పరిశీలించినట్లు తెలిపారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీలు



ఖోఖో పోటీల్లో తలపడుతున్న జట్లు

మెదక్ అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మైదానంలో మంగళవారం అండర్- 14, 17 బాలబాలికలకు నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి 12 జట్లు, 96 మంది చొప్పున క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయికి ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 48 మంది క్రీడాకారులు ఎంపికైనట్టు ఎజీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈనెల 23 నుంచి 25 వరకు యాదాద్రిభువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. విజేతలకు ఇంచార్జి డీఈవో విజయ బహుమతులు అందజేశారు.

చేనేతకు త్వరలోనే అధునాతన మగ్గాలు

- సిద్దిపేట జిల్లా ఏడీ ఎం సాగర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దుబ్బాక, నవంబరు18(ఆంధ్రజ్యోతి): చేనేత రంగాన్ని అధునాతన పద్ధతుల వైపు నడిపించడానికి తాము ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, వచ్చే నెలలోపు ఎలక్ట్రానిక్ జాకార్డు మగ్గాలను అందుబాటులోకి తేనున్నట్టు సిద్దిపేట చేనేత జౌళి శాఖ ఏడీ ఎం సాగర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వాలు అన్ని రకాల అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేస్తున్నాయని, అందులో భాగంగా చేనేత కార్మికులకు అందజేస్తున్నామని ఆయన అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'చేనేత ఎదురీత' శీర్షికన వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఎలక్ట్రానిక్ జాకార్డ్ పద్ధతిన కార్మికులకు మగ్గాలను అందించేందుకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, కార్మికులకు నెలలోపు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల అభివృద్ధి కోసం జరుగుతున్న పథకాలు అమలులో ఉన్నాయన్నారు. సహకార సంఘాల ఎన్నికలకు కూడా తాము ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రభుత్వ పరిధిలోని అంశమనీ, దుబ్బాక సొసైటీ బకాయి పడ్డ రుణాలు ప్రభుత్వం, నాబార్డు నిబంధనల ప్రకారం పొందనందువల్ల తాము ఏమీ చేయలేమని ఆయన తెలిపారు. ఈ విషయంలో విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఇర్కోడు విద్యార్థి





జాతీయ స్థాయికి ఎంపికైన ఇర్కోడు విద్యార్థిని, యోగా ఫెయిర్‌లో ప్రతిభ కబర్చిన నారాయణరావుపేట విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందాలు

సిద్దిపేట రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో, సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి రామ్ చరణ్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రవీందర్ గౌడ్ తెలిపారు. పదో తరగతి విద్యార్థి రామ్‌చరణ్ ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ మరియు ప్రశంసా పత్రం అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపక బృందం, ఫిజికల్ డైరెక్టర్ మంజుల, రామ్‌చరణ్‌ను అభినందించారు.

ఆర్టిస్టిక్ యోగా ఫెయిర్ విభాగంలో ద్వితీయ స్థానం

నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు యామిని, శుష్మితలు ఆర్టిస్టిక్ యోగా ఫెయిర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎర్రవల్లి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచే రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపుతున్న తమ విద్యార్థినులు తమ పాఠశాలకే కాకుండా జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ తోట సతీష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, శ్రీనివాస్, నర్సింహ చారి, పద్మలు విద్యార్థినులను అభినందించారు.

ధరల స్థిరత్వం కేంద్ర బ్యాంకు బాధ్యత

- ఆర్బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు



మాట్లాడుతున్న డాక్టర్ దువ్వూరి సుబ్బారావు

పటానచెరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధరల స్థిరత్వం కేంద్ర బ్యాంకుల బాధ్యత అని ప్రముఖ ఆర్థిక వేత్త, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ హైదరాబాద్‌లో ఆయన 'కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధి', 'సమస్యలను పరిష్కరించడం: కేంద్ర బ్యాంకింగ్ భవిష్యత్తు' అన్న అంశాలపై మంగళవారం అతిథి ఉపన్యాసం చేశారు. ధర స్థిరత్వం కేంద్ర బ్యాంకు బాధ్యత అయినప్పటికీ, సరఫరాలో లోపాలు తలెత్తినప్పుడు పన్ను సర్దుబాట్లు లేదా సబ్సిడీలు వంటి ప్రభుత్వ ఆర్థిక జోక్యం అవసరమన్నారు. ద్రవ్యోల్బణం పేదలపై అతి పెద్ద పన్నుగా డాక్టర్ సుబ్బారావు అభివర్ణించారు. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని గుర్తుచేసుకుంటూ, ఆర్బీఐ గవర్నర్‌గా తన అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో జీఎస్‌బీ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తిగుప్తా, పీజీ విభాగాధిపతి ప్రొఫెసర్ రనజీ, ప్రొఫెసర్ అజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్య స్నేహితురాలితో సన్నిహిత సంబంధం..
యువకుడిని కత్తితో పొడిచి హత్య



హబీబ్ అన్సారీ (ఫైల్)

నర్సాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్ శివారులో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. భార్య స్నేహితురాలితో సన్నిహిత సంబంధం పెట్టుకోవడంతో ఆమె తరఫు వారు ఓ యువకుడిని దారుణంగా పొడిచి చంపినట్లు అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి వివరాలు ఆమె, పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోండా జిల్లాకు ఉత్రౌల తాలుకా గోవర్ధన్ గ్రామానికి చెందిన హబీబ్ అన్సారీ(24) బతుకుదెరువు కోసం ఇక్కడకు వచ్చి.. ఇక్కడ ప్లంబర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆరేళ్ల క్రితం అతను సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో పని చేస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన సల్మాబేగంను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వివాహం అయిన నాటి నుంచి భార్యాభర్తలు నర్సాపూర్‌లో నివాసం ఉంటున్నారు. అయితే, అన్సారీ భార్య సల్మాబేగంకు ఓ చిన్ననాటి స్నేహితురాలు ఉంది. ఆమెకు గతంలో వివాహం జరిగింది. కొన్ని కారణాల వల్ల భార్యభర్తలు దూరంగా ఉంటున్నారు. ఆమె కూడా నర్సాపూర్‌లోనే నివాసం ఉంటోంది. స్నేహితురాలి వద్దకు వస్తూ పోతున్న క్రమంలో ఆమెతో అన్సారీకి సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో సల్మాబేగం డెలివరీకి తల్లిగారింటికి వెళ్లి వచ్చినా అన్సారీ ఆమె వద్దకు రాకుండా భార్య స్నేహితురాలితోనే ఉంటున్నాడు. ఇదే విషయంలో ఇటు అన్సారీ.. సల్మాబేగంల మధ్య.. అటు సల్మాబేగం స్నేహితురాలు.. ఆమె భర్త మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం సల్మాబేగం స్నేహితురాలి వద్దకు ఆమె భర్తతో పాటు కుటుంబీకులు వచ్చారు. పంచాయతీ జరగగా, ఇరు కుటుంబాల మధ్య గొడవలు వద్దని ఎవరి జోలికి ఎవరూ వెళ్ల వద్దని ఒప్పందానికి వచ్చారు. చర్చలు అయిపోయిన తర్వాత రాత్రి పది గంటల సమయంలో స్థానిక రాయరావు చెరువు వద్దకు సల్మాబేగం స్నేహితురాలు.. ఆమె భర్త.. కుటుంబ సభ్యులు వచ్చారు. ఈ క్రమంలో ఆమె అన్సారీకి ఫోన్ చేసి 'మరో వ్యక్తితో సంబంధం పెట్టుకున్నావని.. నన్ను చంపడానికి ప్రయత్నిస్తున్నారు.. వెంటనే రా' అని చెప్పింది. అన్సారీ అక్కడికి వెళ్లగా, ఆమె భర్తతో పాటు కుటుంబీకులు తన భర్త చేతులు, కాళ్లు పట్టుకుని కత్తితో ఇష్టానుసారంగా పొడిచి పక్కనే ఉన్న పొదల్లో పడేశారని, తనకు సమాచారం అందడంతో వెంటనే అక్కడికి వెళ్లి చూడగా, తన భర్త రక్తపు మడుగులో పడి ఉన్నాడని అన్సారీ భార్య సల్మాబేగం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అప్పటికే అతడు చనిపోయాడని వివరించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడితో పాటు అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ జాన్‌రెడ్డిలు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

రామచంద్రాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని కొల్లూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం అరాదియా జిల్లాకు చెందిన దిల్‌కుష్‌కుమార్(23) తెల్లాపూర్‌లోని 'మై హోం సయుక్' నిర్మాణ సంస్థలో కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి వద్ద దిల్‌కుష్‌కుమార్ 500 గ్రాముల గంజాయి కొనుగోలు చేశాడు. దీన్ని మై హోం సయుక్‌లోని లేబర్‌లకు విక్రయించే క్రమంలో నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు అతన్ని పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న 470 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గణేశ్‌పటేల్ తెలిపారు.

145 గ్రాముల గంజాయి పట్టివేత

తూప్రాన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెయింటర్‌గా పనులు చేస్తూ ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులకు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. శివ్వంపేట మండలం లచ్చిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన శ్రావణ్(24) పెయింటర్‌గా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రేమ వివాహం చేసుకున్న శ్రావణ్ కొంత కాలం తూప్రాన్ పట్టణంలో పోలీసుస్టేషన్ వెనుక నివాసముంటున్నాడు. శ్రావణ్ గుట్టుగా గంజాయి తీసుకువచ్చి అమ్మకాలు నిర్వహిస్తున్నాడు. స్థానికులకు అమ్మకాలు చేస్తే బయట పడతామని, ఇతర రాష్ట్రాల వ్యక్తులను ఎంచుకొని అమ్మకాలు జరుపుతున్నాడు. నమ్మదగిన సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో శ్రావణ్ వద్ద 145 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దారిమళ్లిన సీఎంఆర్ ధాన్యం

- గుర్తించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- రెండు రైస్ మిల్లులపై కేసు

నారాయణఖేడ్/కల్హేర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ ధాన్యం(కస్టమ్ మిల్లింగ్ రైస్) దారి మళ్లించిన రెండు రైస్ మిల్లులపై కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తెలిపారు. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని రెండు రైస్‌మిల్లుల్లో దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని దారి మళ్లించినట్లు గుర్తించామని, ప్రభుత్వ నిధులు సహజ వనరుల దుర్వినియోగానికి సంబంధించి కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు. సీఎంఆర్ ధాన్యం దారి మళ్లించినట్లు సమాచారం అందడంతో సిర్గాపూర్ మండలం కడ్పల్ శివారులోని సామ్రాట్ ఫుడ్ ఇండస్ట్రీస్, కల్హేర్ మండలం మార్డి శివారులోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్‌లో సోమవారం ఆర్సీపూర్ యూనిట్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కడ్పల్ శివారులోని సామ్రాట్ ఫుడ్ ఇండస్ట్రీస్‌లో రబీ, ఖరీఫ్ 2024-2025 సీజన్‌కు సంబంధించి దాదాపు 40,834.98 క్వింటాళ్ల(1,02,087 బస్తాలు) తక్కువ ఉన్నట్లు గుర్తించారు. ఈ ధాన్యం విలువ రూ. 9,47,37,153 ఉంటుందని అధికారులు తెలిపారు. మార్డి శివారులోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్‌లో తనిఖీలు చేయడంతో 3,313 క్వింటాళ్ల (82.83 బస్తాలు) ధాన్యం తక్కువగా ఉన్నట్లు తేలింది. ఈ ధాన్యం విలువ రూ. 76,86,624 ఉంటుందని తెలిపారు. ఈ మేరకు రెండు రైస్ మిల్లులపై మంగళవారం కేసులు నమోదు చేశారు. ఎక్కడైనా సహజ వనరులు, ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 14432 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక అక్రమ రవాణా

తూప్రాన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో హల్దీ వాగు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్లకు అనుమతులు ఇవ్వడంతో ఒకచోట డంప్ చేసి టిప్పర్లలో రవాణా చేస్తున్నారు. తూప్రాన్ పట్టణ పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుకను మంగళవారం ఇసుక వ్యాపారులు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారులు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇసుకను సేకరిస్తున్నారు. టిప్పర్లలో తూప్రాన్ ప్రాంతానికి తరలించి, విక్రయాలు చేస్తున్నారు. మంగళవారం ఓ టిప్పర్‌లో ఇసుకను నింపి, పైన గుర్తుపట్టకుండా ఉండేందుకు డస్ట్ నింపి రవాణా చేస్తున్నారు. ఈ విషయం తెలిసి ఇసుక వ్యాపారులు టిప్పర్‌ను అడ్డగించి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కల్యాణం.. కమనీయం..

- వర్గల్ శంభుగిరి క్షేత్రంలో వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



పార్వతి పరమేశ్వరుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వర్గల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ కేంద్రంలోని శంభుగిరి కొండ గుహల్లో స్వయంభువుగా వెలసిన అన్నపూర్ణ సహిత స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో, కార్తీకమాసం సందర్భంగా మంగళవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు జంగం వీరభద్రయ్య శివస్వామి నేతృత్వంలో శంభులింగేశ్వర స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి ప్రస్థానం, విజయోత్సవ పూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై అర్చకుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్యన పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను భక్తులు స్వీకరించారు. వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో జ్వాలతోరణం

వర్గల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం రాత్రి ఆలయం వద్ద దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిత్య కార్తీక దీపోత్సవంలో భాగంగా జ్వాల తోరణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి దేవతామూర్తులను మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు జ్వాల తోరణం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం అంధకారం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

పుల్‌కల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం అంధకారమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. చౌటకూరు మండలం సుల్తానాపూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో 'నషా ముక్త్, భారత్-కుషహల్ భారత్ కార్యక్రమంలో మంగళవారం మహిళా, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ముందుగా జిల్లా అదనపు కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, జిల్లా మహిళా, శిశు, వికలాంగుల సక్షేమ శాఖ అభివృద్ధి అధికారి లలితాకుమారిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్‌ను విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విశ్వనాథ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శైలజ, సునీత, బేబీశాలిని, జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి, ఎస్ఐ విజయ్‌కుమార్, సుల్తాన్‌పూర్ మాజీ ఉప సర్పంచ్ గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, చంటి రమేశ్ పాల్గొన్నారు.

లంచాల లాఠీ..!

(5వ పేజీ తరువాయి)

పట్టుబడడంతో స్థానికులు టపాసులు కాల్చారంటేనే అతని తీరు ఎలాంటిదో అర్థమవుతోంది.

సిద్దిపేటలో సెట్‌రైట్

సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.ఎం విజయ్‌కుమార్ పదేపదే పోలీస్ శాఖను హెచ్చరిస్తున్నారు. ఎవరైనా లంచం అడిగినా, సివిల్ పంచాయతీల్లో తలదూర్చినా తగిన చర్యలు తప్పవని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. పోలీసుల కనుసన్నల్లో ఇప్పటిదాకా కొనసాగిన పలు అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురిని మందలించినట్లు తెలిసింది. మరోసారి ఆరోపణలు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సూచనలు చేసినట్లుగా సమాచారం. ప్రధానంగా దళారులు స్టేషన్లలోకి ఎంట్రీ ఇవ్వొద్దని హెచ్చరించారు. సీపీ వైఖరితో ఎప్పుడేం జరుగుతుందోనని పోలీస్‌శాఖలో భయం పట్టుకుంది.

ఐఐటీ హైదరాబాద్‌లో జపాన్ అకాడమిక్ డే

కంది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో మంగళవారం జపాన్ అకాడమిక్ డే 3వ ఎడిషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జపాన్-ఇండియా విశ్వవిద్యాలయాల ఫోరమ్ నుంచి 37 జపనీస్ విశ్వవిద్యాలయాలు, 36 భారతీయ విశ్వవిద్యాలయాల అధిపతులు హాజరయ్యారు. భారతదేశంలో జపాన్ గౌరవనీయ రాయబారి ఓనో కీచి, జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ (జేఎస్‌టీ) అధ్యక్షుడు డాక్టర్ హషిమోటో కజుహిటో, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి ఈ సందర్భంగా మాట్లాడారు.



మంజీర నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కొల్చారం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొల్చారం మంజీర నదిలో గల్లంతైన యువకుని మృతదేహం మంగళవారం పోతంశెట్టిపల్లి శివారు మొదటి బ్రిడ్జి వద్ద లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన తాపీ మేస్త్రీ కోటేశ్వరరావు (34) తన స్నేహితులతో ఆదివారం ఏడుపాయల వన దుర్గ మాతను దర్శించుకోవడానికి వచ్చారు. నదిలో స్నానానికి వెళ్లగా, నది ప్రవాహానికి కొట్టుకుపోయాడు. వెంటనే స్నేహితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జాలర్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఆదివారం నుంచి గాలింపు చర్యలు చేపట్టాయి. మంగళవారం బండరాళ్ల మధ్య మృతదేహం లభ్యమైంది. భార్య రోహిణి ఫిర్యాదు మేరకు ఎస్సై మొయినుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మిరుదొడ్డి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ రైతు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సమత కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎనగంటి రాజు (45) తనకున్న మూడు ఎకరాల్లో నాలుగు బోర్లు వేశాడు. ఇందుకోసం అప్పులు చేశారు. అలాగే, కుమార్తె వివాహానికి సుమారు రూ. 18లక్షల వరకు అప్పులు అయ్యాయి. వ్యవసాయంపైనే ఆధారపడిన రాజు అప్పులు తీరే మార్గం కనిపించక మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో వ్యవసాయ భూమి వద్ద క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో చనిపోయాడు.

రైలు కిందపడి యువకుడు..



సాయికుమార్ (ఫైల్)

తూప్రాన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి రైల్వే ట్రాక్‌పై మంగళవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ పట్టణంలో నివాసముండే మణి, గోపీచారి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. నాలుగైదు ఏళ్ల క్రితం గోపీచారి మృతి చెందగా, మణి ఇద్దరు కుమారులతో జీవిస్తోంది. చిన్న కుమారుడు వడ్ల సాయి కుమార్ (27) కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. సాయికుమార్ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. రెండేళ్ల క్రితం సాయికుమార్ పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించగా, చికిత్స అందించడంతో కోలుకున్నాడు. మద్యం సేవించి ఇంట్లో గొడవలు చేస్తున్నాడు. సోమవారం సైతం మద్యం సేవించి ఇంటికి రాగా కుటుంబ సభ్యులు మందలించారు. దాంతో ఇంట్లోంచి బయటకు వెళ్లిన సాయికుమార్ బ్రాహ్మణపల్లి రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు దొంగను పట్టించిన సీసీ కెమెరా

పటాన్ చెరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో గొలుసు లాక్కొని పారిపోయిన ఓ దొంగను సీసీ కెమెరా ఆధారంగా పట్టుకున్న సంఘటన పటానచెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వినాయక రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు జీఎంఆర్ కూడలిలోని అపోలో మెడికల్ షాపులో జాటోతు నిఖిత అనే మహిళ పని చేస్తుండగా, పటానచెరు చైతన్య నగర్‌లో నివాసం ఉంటున్న కొమరగూడెం లోకేష్ అనే వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు అందుకున్న పోలీసులు షాపులో సీసీ కెమెరా ఆధారంగా గంట సమయంలోనే లోకేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారిపై కేసు

దుబ్బాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ, పలువురిని ఇబ్బందులకు గురి చేస్తున్న ఒక వడ్డీ వ్యాపారిని మంగళవారం దుబ్బాక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గంబీర్‌పూర్ గ్రామానికి చెందిన చింతు గణేష్ వడ్డీ వ్యాపారి. బంగారం, భూమి, వాహన పత్రాలు కుదువ పెట్టుకుని అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ పలువురిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న దీనిపై దుబ్బాక పోలీసులు అతని ఇంటిపై దాడి చేసి, అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి నాలుగు కార్లు, ఒక ట్రాక్టర్, ఏడు ద్విచక్ర వాహనాలు, ప్రామిసరీ నోట్లు, భూముల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు సుమోటోగా వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జరిమానా, ఒకరికి జైలు

గజ్వేల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి రూ.30 వేల జరిమానా, ఒకరికి జైలుశిక్ష పడింది. గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం.మురళీ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని పలు చౌరస్తాల్లో తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడగా, మంగళవారం వారిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. విచారణ జరిపిన న్యాయమూర్తి ముగ్గురికి రూ.10వేల చొప్పున రూ.30వేల జరిమానా, ఒకరికి రెండు రోజుల శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెలువరించారు.

డ్రైన్‌కాలువల నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు

చేర్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా చేపట్టిన డ్రైన్‌కాలువల నిర్మాణం పూర్తిలో ఎన్‌హెచ్, మున్సిపల్, విద్యుత్‌శాఖాధికారుల నిర్లక్ష్యం తగదని సీపీఎం పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు అన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ స్తంభాల మార్పు పేరిట పలు ప్రదేశాలలో తీసిన గోతులు ప్రమాదకరంగా మారాయని, డ్రైన్ అసంపూర్తి పనుల వలన దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో పాటు వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నా నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటం తగదని మండిపడ్డారు. వెంటనే నిర్లక్ష్యపు జబ్బువీడి పనులు పూర్తిచేయాల, లేనియెడల ఆయా శాఖల కార్యాలయాలు ముట్టడిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ప్రీ ఎనలైజర్ టెస్ట్ తప్పనిసరి

సిద్దిపేట అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ లో తనిఖీలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు ఫైన్ విధిస్తున్నారు పోలీసులు. అదే విధంగా ఆర్టీసీలో కూడా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చడానికి ఆర్టీసీ డ్రైవర్లకు కండక్టర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించి విధులకు పంపిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బస్సు ప్రమాదాలు రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల ప్రాణాలను కాపాడుకోవడం కోసం సురక్షిత ప్రయాణం కోసం బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ భవ భూతి తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ములుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ములుగు గ్రామానికి చెందిన ఎర్రన్న నరసయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థిక సాయం 10వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ వార్డు సభ్యులు నాగేష్ ముదిరాజ్, తోడేటి నరేందర్, తలారి నర్సింలు, గంగలమైన రమేష్, తిగుళ్ల నర్సింలు, ఎర్రన్న కృష్ణ, రవి తదితరులున్నారు.

నేల చూస్తున్న నిఘా నేత్రాలు

- నేరాల కట్టడి ఎలా..
- ఒక్కో గ్రామంలో 10 నుంచి 34 కెమెరాలు ఏర్పాటు
- మరమ్మతులు చేయలేక చేతులెత్తేస్తున్న గ్రామ పంచాయతీలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు.. ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయా గ్రామాల ప్రజలు

సిద్దిపేట రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ కోసం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు నెలల కొద్ది మరమ్మతులకు నోచుకోక నేల చూపులు చూస్తున్నాయి. ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానమంటూ పోలీసు అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అచరణకు నోచుకోవడం లేదు. గత ప్రభుత్వం హయాంలో సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఒక్కో గ్రామంలో 10 నుంచి 34 కెమెరాలను ఏర్పాటు చేశారు. మొదట్లో బాగానే పని చేసిన సీసీ కెమెరాలకు చిన్న చిన్న మరమ్మతులు రావడంతో గ్రామ పంచాయతీ నుంచే నిర్వహణ చేపట్టే వారు. మరమ్మతులకు బిల్లులు తడిసి మోపెడు కావడంతో గ్రామ పంచాయతీలు కూడా చేతులెత్తేస్తున్నాయి. దీంతో ఉన్నతాధికారులు సైతం సీసీ కెమెరాల నిర్వహణ పై పట్టించుకోవడంలేదనే ఆరోపణలు లేకపోలేదు.

ప్రైవేట్ వ్యాపారుల కెమెరాలే దిక్కు

గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కెమెరాలు పూర్తి స్థాయిలో పని చేయకపోవడంతో నేరాల సరిశోధనకు ప్రైవేట్ వ్యాపార సంస్థలు వారి కార్యాలయాలు, దుకాణాల ముందు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలే దిక్కవుతున్నాయి. అవికుడా ఎక్కడో ఒక చోట ఉండడంతో నేరస్తులను గుర్తించడంలో పోలీసులకు కష్టాలు తప్పడంలేదు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సీసీ కెమెరాల డిస్లే బాక్స్‌లు అధ్వానంగా మారిపోవడంతో నేరం చేసి తప్పించుకునేందుకు అస్కారం లేకపోలేదు.


ఇర్కోడు, రాఘవాపూర్ గ్రామ పంచాయితీల్లో పని చేయని సీసీ కెమెరాల స్టోరేజి సర్వర్ బాక్స్‌లు, ఎల్ఈడీ డిస్‌ప్లేలు

చోరీలు, ప్రమాదాలు జరిగినా దొరకని ఆచూకీలు

గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో రోజురోకు నేరాలు పెరుగుతున్నాయి. ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు, చోరీలు జరిగినప్పుడు గుర్తుతెలియని వాహనాలను, అక్రమ రవాణను అరికట్టేందుకుగాను, పలు కేసుల్లో నేరస్తులను గుర్తించడం కోసం పోలీసు సిబ్బంది కష్టాలు అంతాఇంతా కాదు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాయాలు , ఎక్కువ మొత్తంలో ప్రజలు సంచరించే ప్రాంతాల్లో, ప్రధాన రోడ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాల్సిన అవసరం ఉంది.


సిద్దిపేట రోడ్లలో బండచేర్లపల్లి వద్ద నేలకు చూస్తున్న సీసీ కెమెరాలు, ఇర్కోడు గ్రామంలో అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం

సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. గతంలో ఏర్పాటు చేసిన కెమెరాలు కోతుల బెడద కారణంగా చాలా చోట్ల సమస్యలు వస్తున్నాయి. ప్రధానంగా దుకాణదారులను, వ్యాపార సంస్థలను సొంతంగా ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించడం జరుగుతుంది. గ్రామాల్లో ఇప్పటికే ఉన్న కొన్ని సీసీ కెమెరాలను మరమతు చేయించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. గ్రామాల్లో అవగాహనలు కల్పించి గ్రామ పంచాయతీల సహకారంతో సీసీ కెమెరాలు వినియోగంలోకి వచ్చేలా చేస్తాం. గ్రామాల్లో దాతాలు ఎవరైనా ఉంటే గ్రామాభివృద్ధిలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని పెర్కొన్నారు.

-కె.రాజేష్, ఎస్సై, సిద్దిపేట రూరల్

రంగోత్సవంలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కొండపాక, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ముంబైలో ఇటీవల జరిగిన 2025-26 సంవత్సరపు రంగోత్సవం వేడుకల్లో కొండపాక గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొని పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మంగళవారం అభినందించారు. రంగోత్సవం వేడుకల్లో కలరింగ్ టాటూ వేయడం, చేతిరాత కాలేజ్ కార్టూన్ తయారీ స్కెచ్ , ఫింగర్ అండ్ తంబు పెయింటింగ్ జరిగాయి. ఆ వేడుకలలో కొండపాక సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాల నుంచి 96 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 30 మంది విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారని ప్రిన్సిపల్ సతీష్ కుమార్ తెలిపారు. ఇందులో 16 బంగారు పతకాలు, 8 వెండి పతకాలు, ఐదు కాంస్య పతకాలు సాధించారు. 10వ తరగతి బి సెక్షన్ విద్యార్థి ఎం ఈశ్వర్ జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించడమే కాకుండా ఇండియాస్ యాక్టివిటీస్ ఎక్సలెన్స్ అవార్డు తమ పాఠశాలకు వచ్చిందని ఆయన తెలిపారు.

నిర్లక్ష్యం.. నీటి వృథా..!

చేర్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి పక్కన గల భవనాల ఆవరణలో మిషన్ భగీరథ నీరు రోజుల తరబడిగా వృథాగా పోతుంది. ఓ వైపు సాంకేతిక కారణాలు, ఇతరత్రా చర్యల వలన పలు కాలనీలలో మిషన్ భగీరథ నీరురాక ఆయా కాలనీల ప్రజలు నానాతంటాలుపడుతుండగా, ప్రధాన రహదారి వెంబడి మాత్రం పలువురు నీటిని వృథా చేస్తున్నారు. కనీసం డమ్మీలను కూడా ఏర్పాటుచేయకపోవడంతో నీరంతా రోడ్డుపై ప్రవహిస్తున్నా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు. ఇప్పటికే పట్టణ ప్రజల అవసరాలకు సరిపడా నీరు సరఫరా కాకున్నప్పటికీ వచ్చే నీటినైనా సద్వినియోగం చేసుకోని తీరుపట్ల ఆయా భవన యాజమానుల తీరుపై పలువురు మండిపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటి వృథా అరికట్టేందుకు ప్రత్యామ్నాయచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు,


బాలాజీ థియేటర్ సమీపంలో వృథాగా పోతున్న నీరు

ఎరువులు అధిక ధరకు అమ్మితే చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి

రాయపోల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఎంఆర్‌పీకు మించి విక్ర యిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి హెచ్చరించారు. మంగళవారం రాయపోల్ మండలంలో పర్యటించిన ఆమె చిన్నమాసాన్‌పల్లి గ్రామంలో రైతునేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్స్, యూరియా నిల్వలను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.


రాయపోల్‌లోని అగ్రోస్ విక్రయ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో స్వరూపరాణి

మాలలకు రిజర్వేషన్ శాతం పెంచి రోస్టర్ పాయింట్ తగ్గించాలి

- మాలమహానాడు నాయకుడు తుమ్మ శ్రీనివాస్

గజ్వేల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేయడంతో మాలలకు అన్యాయం జరుగుతుందని మాల మహానాడు నాయకుడు తుమ్మ శ్రీనివాస్ మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి గజ్వేల్‌కు వచ్చిన సందర్భంగా దళిత సంఘాల కార్యచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి, మాల మహానాడు యువజన కార్యదర్శి నిరుడి స్వామి, హంస నాయకులు బండారి దేవేందర్, కృపానందంతో కలసి మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలలకు రిజర్వేషన్ శాతం పెంచి రోస్టర్ పాయింట్ తగ్గించాలని కోరారు. ప్రస్తుతం రోస్టర్ పాయింట్ విధానం వలన మాల, అనుబంధ కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రతి ఉద్యోగ నియామకంలో, ప్రమోషన్ పొందే క్రమంలో ప్రతి కులానికి కనీస అవకాశం రావాలని సూచించిందని, కానీ ఇటీవల శాతవాహన యూనివర్సిటీ నియమకాల్లో మాల, మాల అనుబంధ కులాలకు ఒక్క పోస్టు రాలేదన్నారు.

ధాన్యం తూకాలను త్వరితగతన చేపట్టాలి

దౌల్తాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని తేమ శాతం వచ్చిన వెంటనే త్వరితగతన ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే మిల్లులకు పంపించాలని దుబ్బాక ఏడిఏ మల్లయ్య అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందుప్రియల్ గ్రామ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఐడిఏ మల్లయ్య రైతుల తో మాట్లాడుతూ. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా, కొనుగోళ్లు ఏ విధంగా సాగుతున్నాయి, తూకం, తేమశాతం, తరుగు ఎలాంటి తేడాలు ఉన్నాయని రైతుల వద్ద పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పూర్తయిన ఇందిరమ్మ ఇంటి పరిశీలన

కొండపాక, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొండపాకలో పూర్తయిన ఇందిరమ్మ ఇంటిని అధికారులు మంగళవారం పరిశీలించారు. కొండపాక గ్రామానికి చెందిన గడీల బాలవ్వకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఇంటి నిర్మాణం పూర్తి చేసింది. మోడల్ ఇందిరమ్మ ఇంటిని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తహసీల్దార్ మల్లికార్జున్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగారావు, ఎఎంసీ వైస్ చైర్మన్ పరశురాములు తదితరులు పరిశీలించారు.

గీత కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

చేర్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ఎన్నికలముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కల్లుగీత కార్మికసంఘం రాష్ట్రకార్యదర్శి బూడిద గోపి అన్నారు. చేర్యాల పట్టణంలోని షాదీఖానాలో మంగళవారం జరిగిన సంఘం జిల్లామహాసభలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. పెన్షన్ రూ.4వేలకు పెంచడంతో పాటు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియో అమలుచేస్తామని, బెల్ట్ షాప్‌లు రద్దుచేస్తామని, చెప్పినా ఆచరణలో పెట్టకపోవడం తగదన్నారు. గీత కార్మికులపై చిత్తశుద్ధిఉంటే రూ.5వేల కోట్లమేర నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 28,29,30తేదీలలో సూర్యాపేటలో నిర్వహించతలపెట్టిన గీతన్న రణభేరి బహిరంగసభకు గీతకార్మికులు తరలిరావాని కోరారు.

నైపుణ్య శిక్షణలో నర్సింగ్ విద్యార్థులు

మద్దూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగిస్తున్న నర్సింగ్ విద్యార్థులు శిక్షణలో భాగంగా మద్దూరు పీహెచ్‌సీని సందర్శించి ప్రాక్టికల్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన వారికి బీపీ, షుగర్, పరీక్షలు నిర్వహించారు. రక్తపరీక్షలు నిర్వహించి కంప్యూటర్‌లో పొందుపర్చారు. వైద్యం కోసం వచ్చిన వారి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేశారు. అనంతరం వైద్యాధికారి సీహెచ్ మహేందర్ మాట్లాడారు. విద్యార్థులకు నైపుణ్యశిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

డైరీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


ప్రవర్ష డైరీ వదులుతున్న వ్యర్థాలను పరిశీలిస్తున్న ఎంఆర్పీఎస్ నాయకులు

జగదేవ్‌పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కాలువలో ప్రవర్ష డైరీ వ్యర్థ జలాలు విడుదల చేస్తున్నందున డైరీ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజు కోరారు. మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు పరిస్థితిని పరిశీలించారు. రాజు మాట్లాడుతూ.. డైరీ నుంచి వెలువడే మలినాల కారణంగా కాలువ నీరు పంటలకు చేరి రైతులు చర్మ సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. గతంలో ఇరిగేషన్ శాఖ నోటీసులు ఇచ్చినా డైరీ స్పందించలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డైరీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు వికాస్ విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 69వ ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్ కు సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని వికాస్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుమోహన్ మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో అండర్ 17ఫుట్ బాల్ గవర్నమెంట్ లో మూడో స్థానంలో రిషికేశ్, అండర్ 17 క్రికెట్ టోర్నమెంట్ కు మన్విత్ రెడ్డి, అభినవ్ రెడ్డిలు ఎంపికైనట్లు తెలిపారు. క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఆటలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం డాక్టర్ భాస్కరరావు ప్రిన్సిపాల్ మధుమోహన్ విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

మృతుడి కుటుంబాన్ని ఎంపీ పరామర్శ

చేర్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం కాశీగుడిశెలు గ్రామానికి చెందిన షేక్ మదార్ (32) ఇటీవల గుండెపోటుతో దుబాయ్‌లో మృతిచెందగా, మంగళవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జనగామ డీసీసీ ఉపాధ్యక్షుడు, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మృతుడి కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు.ఇదిలా ఉండగా, చేర్యాల మండలం నాగపురి గ్రామశివారు గండికుంట కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు బాబు తండ్రి చెన్నమల్లు రామయ్య (75) అనారోగ్యంతో మృతి చెందడం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అలాగే పట్టణానికి చెందిన సీనియర్ పార్టీ నాయకుడు మంచాల చిరంజీవులు ఇటీవల అస్వస్థతకు గురై చికిత్స పొందుతుండగా పరామర్శించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

మిరుదొడ్డి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి):చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో డీలర్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడాదుస్తువుల పంపిణి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కథలపోటీలో రాణించిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కడవేరుగు జడ్పీఎస్ఎస్ ఉపాధ్యాయులు

చేర్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన బాలకథల పోటీ-2025లో చేర్యాల మండలం కడవేరుగు జడ్పీఎస్ఎస్ విద్యార్థులు రాయారపు పావణి, మడికొండ శ్రీవిద్య, కందుల శ్రవణ్‌అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. రైతు గొప్పతనం అంశంపట్ల రాయాపు పావణి వ్రాసిన కథ ద్వితీయస్థానం, మడికొండ శ్రీవిద్య తీరిన చదువు కోరిక అంశంపట్ల వ్రాసిన కథ ప్రోత్సాహక బహుమతి, కందుల శ్రవణ్ వ్రాసిన ముగ్గురు స్నేహితులు కథ బాల కథాసంకలనంలో చోటుదక్కించుకున్నాయి. ఈమేరకు మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హెచ్ఎం రాజమణి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుంది

గజ్వేల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన మిందె నరేశ్‌కు ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా నరేశ్‌కు నియమాక పత్రాన్ని ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరితో కలసి అందజేశారు.

వేదభవన్‌కు గ్రానైట్ విరాళం

సిద్దిపేట అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం కిష్ట సాగర్ సమీపంలోని వేద భవన్ (వికాస తరంగిణి) 4లక్షలు రూపాయల విలువ గల గ్రానైట్‌ను మంగళవారం సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అందించినట్లు వికాస తరంగిణి సభ్యులు సభ్యులు తెలిపారు. సిద్దిపేట లో శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి మంగళాశాసనాలతో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు సిద్దిపేట లో వికాస తరంగిణి భవనానికి ఎకరం స్థలం ఇచ్చారు, అదేవిదంగా రు.45 లక్షల రూపాయలతో భవనాన్ని నిర్మించారని అడగగానే భవనానికి అవసరం అగు గ్రానెట్ అందించారని వికాస తరంగిణి సభ్యులు తెలిపారు.

గ్రామాల్లో ప్లాస్టిక్‌ను అంతం చేద్దాం

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్లాస్టిక్‌ను సమూలంగా అంతం చేసి ఆరోగ్యాన్ని రంక్షించుకుందామని హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహిచారు. మంగళవారం గాంధీనగర్‌లో జాతీయ సేవా పథం విద్యార్థులు నిర్వహిస్తున్న శీతాకాల శిబిరంలో భాగంగా ప్లాస్టిక్‌పై, మద్యపాన నిషేదం, పర్యావరణ పరిరక్షణ,సంపూర్ణ అక్షరాస్యత, మంచి అలవాట్లపై మానవ హారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మరకత లింగేశ్వరస్వామి ఆలయంలో 365 లింగాలతో అర్చన


శ్రీ మరకత లింగేశ్వర స్వామి ఆలయంలోమహా లింగార్చన

హుస్నాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ మరకత లింగేశ్వర స్వామి ఆలయంలో 365 లింగాలతో మహా లింగార్చన కార్యక్రమం నిర్వహించారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 58వ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, సుడోకో పోటీలు నిర్వహించారు. పోటీలను సిద్దిపేట జిల్లా అర్.టి.ఏ మెంబెర్ ఎల్. డాక్టర్ సూర్యవర్మ ప్రారంబించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రరీ సైన్స్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. సుమారు 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాఘవాచార్య స్మారక గ్రంథాలయ వారోత్సవ పోటీలు

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలోని కే.వీ. రాఘవాచార్య స్మారక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పీజీ విద్యార్థులకు;వ్యాసరచన, కథారచన, ఉపన్యాస పోటీలు జరిగాయి. వరుసగా నాకు నచ్చిన పుస్తకం-విశ్లేషణ, చదువు వెలుగు, వ్యక్తిత్వ వికాసంలో సాహిత్య ప్రాధాన్యత అనే అంశాలపై జరిగిన పోటీల్లో ఇరువైమూడు మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలను ప్రిన్సిపల్ డా. జి. సునీత అభినందించారు.

సన్న వడ్ల బోనస్ డబ్బులు చెల్లించాలి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లు పండించిన రైతులకు రూ 500 బోనస్ డబ్బులు చెల్లిస్తామని ప్రకటించింది. బోనస్ డబ్బులు చెల్లించక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు బోనస్ డబ్బులు చెల్లించాలని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజక వర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. హుస్నాబాద్ సింగిల్ విండో పరిధిలో దాదాపు పదివేల క్వింటాళ్ల వరకు రైతులకు బోనస్ డబ్బులు చెల్లించలేదన్నారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచడం లేదని, గోనెసంచులు చినిగిపోయినవి ఇవ్వడంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తడిసిన ధాన్యంలో కోతలు పెట్టి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బులు వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేయాలి

గజ్వేల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): హాస్టళ్ల, గురుకులాల విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేయాలని కోరుతూ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని డీబీఎఫ్ నాయకులు కోరారు.

టెట్ టెన్షన్

(5వ పేజీ తరువాయి)

వీరు ఈ సంవత్సరం టెట్ అర్హత సాధించేందుకు సిద్ధమవుతున్నారు. తమకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని పలు ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

ఆర్‌టీఈ యాక్టును సవరించాలి

వర్గల్ : ఆర్‌టీఈ యాక్టును సవరించి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఆయన వెంట జోన్ కన్వీనర్ శ్రీనివాస్, మండల అధ్యక్షులు పర్వతం నర్సయ్య, ప్రధాన కార్యదర్శి పిల్లి రాములు, జిల్లా కౌన్సిలర్‌లు నర్సింగరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో చట్ట సవరణ చేయాలి



టెట్ తప్పనిసరి అనే అంశం ఉపాధ్యాయులను ఎంతో మనోవేదనకు గురిచేస్తుంది. 30 సంవత్సరాల సర్వీసు కలిగిన ఉపాధ్యాయులు ప్రస్తుతం టెట్ రాసి పాస్ కావడం అంటే చాలా శ్రమతో, వేదనతో కూడుకున్న పని. కేంద్రం స్పందించి, విద్యాహక్కు చట్టం 2009లోని సెక్షన్ 23 అండర్ 2 సెక్షన్‌ను సవరించి, 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయింపు ఇస్తూ చట్ట సవరణ చేయాల్సి.

- వంగా మహేందర్ రెడ్డి, పీఆర్టీయూ అధికార ప్రతినిధి

మాదక ద్రవ్యాలపై అవగాహన

మద్దూరు/హుస్నాబాద్‌రూరల్/సిద్దిపేట కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ, రవాణా పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎక్సైజ్ సూపరెండెంట్ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే అన్ని విద్యాసంస్థల్లో యాంటి డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, ఏదైనా అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా యంత్రాంగానికి తెలియపర్చాలని కోరారు. సిద్దిపేటను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చడం లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు. డిడబ్ల్యూవో శారద మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.

మద్దూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సీహెచ్ మహేందర్ మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు.